నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, సోమవారం 21 అక్టోబర్ 2024 | MEDAK

జహీరాబాద్‌లో రైతు భరోసా ఎగవేతకు నిరసనగా ధర్నా చేపడుతున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

పెద్దమ్మను దర్శించుకున్న హరీశ్‌రావు

వర్గల్, అక్టోబర్ 20: వర్గల్ మండలంలోని తునికి ఖాల్సాలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠా పన మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవానికి మాజీమంత్రి హరీశ్‌రావు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు హరీశ్‌రావును ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, కొట్టాల యాదగిరి, వెం కట్‌రెడ్డి, బాలుయాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్గల్: హరీశ్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

ప్రజలను వంచించిన కాంగ్రెస్ సర్కారు

- ధాన్యం వస్తున్న కొనుగోలు సెంటర్లు ప్రారంభించడం లేదు..
- పత్తి రైతులను పట్టించుకోవడం లేదు..
- 420 హామీలు, ఆరు గ్యారంటీలు బోగస్ అయ్యాయి..
- బెజ్జంకిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

ఒక్క హామీ నిలబెట్టుకోవడం లేదు

రైతుల ఉసురు పోసుకుంటున్న సీఎం రేవంత్

బెజ్జంకి, అక్టోబర్ 20: కాంగ్రెస్ హామీల పేరుతో ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లిలో జరిగే అలయ్ బలయ్, ధూంధాం కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న ఆయనకు బెజ్జంకి క్రాసింగ్ వద్ద బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 100 రోజుల్లో 420 హామీలు, 13 గ్యారెంటీలను అమలు చేస్తామని బ్యాండ్ పేప ర్ మీద రాసి ఇచ్చి ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఈ రోజు హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. హామీల బాధ్యత మాది అని ఆనాడు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ ప్రకటించారని, ఈ రోజుల ఆ గాంధీలు మాయమైపోయారని, వారు హామీల గురించి ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించా రు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు రూ.10 వేలు ఇస్తే, తాము అధికారంలోకి వస్తే రూ.15 వేలు రైతు భరోసా ద్వారా ఇస్తామని చెప్పి, నిన్న వ్యవసాయ శాఖ మంత్రి స్వయంగా వానకాలం పంటకు రైతు భరోసా ఇవ్వమని ఎగబెట్టారని విమర్శించారు. బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్టు, న్యూట్రిషన్ కిట్టు ఇవ్వడం లేదన్నారు.

బెజ్జంకి క్రాసింగ్ వద్ద హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు

కరోనా సమయంలో ఆదుకున్న కేసీఆర్..

కేసీఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తే, నేడు కాంగ్రెస్ సర్కార్ ఒక్కొక్కటి రద్దు చేస్తున్నదని హరీశ్‌రావు అన్నారు. రైతు భరోసా ఎందుకు ఇవ్వడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. కరోనా కష్టకాలంలో ప్రభుత్వానికి రూపాయి ఆదాయం లేని సమయంలో సైతం కేసీఆర్ సర్కార్ రైతులకు రైతుబంధు ఇచ్చి కాపాడుకున్నదని గుర్తు చేశారు. 11 విడుతల్లో రాష్ట్రంలో రూ.72 వేల కోట్లు రైతు బంధు కేసీఆర్ ఇస్తాడెట్ల..ఒక్కసారికే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముక్కులోకి వచ్చిందా..అని విమర్శించారు. రైతులకు ఇచ్చిన ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవడం లేదని విమర్శించారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు ఎక్కడా ప్రారంభం కాలేదని, కేంద్రాలకు ఇప్పటి వరకు గన్నీ బ్యాగులు, దారం, రైస్‌మిల్లులు, ట్రాన్స్‌పోర్ట్ అలాట్ కాలేదన్నారు. సన్నాలు పండించిన ప్రతి రైతుకు కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి సంబంధం లేకుండా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటలకు బోనస్ బోగస్ అయిందని ఎద్దేవా చేశారు. బెజ్జంకి మండలంలో పత్తి ఎక్కువగా పండుతుందని, కానీ.. ఇప్పటివరకు సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం కాలేదన్నారు. రాష్ట్రంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాక రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు. ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తక్కువ ధరకు పత్తిని అమ్ముకుని నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్లు, పత్తి, మక్కల కొనుగోలు కేంద్రాలు ఎందుకు ప్రారంభం చేయలేదో ప్రభుత్వం చెప్పాలన్నారు.

ఫోజులు తప్ప...

సీఎం రేవంత్ రోజుకో కార్యక్రమం పెడుతున్నాడని, కేవలం ఫొటోలకు ఫోజులు ఇవ్వడం తప్పా ప్రజలకు ఎలాంటి మేలు జరగడం లేదని హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ సర్కారు అన్ని పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేసిందని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండి రైతుల ఉసురు పోసుకుంటుందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే అన్ని పంటలకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఎన్నికల హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లింగాల నిర్మల, మాజీ జడ్పీటీసీ కనగండ్ల కవిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, లక్ష్మణ్, తిరుపతి, శ్రీనివాస్‌గుప్తా, రాజయ్య, లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి, దేవయ్య, రామాలింగ రెడ్డి, రాజు, మోహన్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేస్తే సహించం

- ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు
- రైతు భరోసా ఎగవేతకు నిరసనగా ధర్నా

జహీరాబాద్, అక్టోబర్ 20: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదని, వందశాతం రుణమాఫీ చేయాలని, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు చెల్లించే వరకు వదిలేది లేదంటూ జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను ఎగ్గొట్టడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం జహీరాబాద్‌లో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయం నుంచి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ చౌరస్తా వరకు బీఆర్ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆనంతరం 65వ జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ..కాంగ్రెస్ గెలిస్తే రైతు బంధు రాంరాం అని అసెంబ్లీలో ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పిన మాటలను అక్షరాలా రేవంత్ రెడ్డి నిజం చేస్తున్నారన్నారు. ఇప్పటికే రుణమాఫీలో మోసం చేసినట్టుగా, వానకాలం పంట చేతికందే సమయం వచ్చినా రైతు భరోసా ఇవ్వకుండా.. చివరికి ఇచ్చేది లేదంటూ మాట దాట వేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. రైతులను విస్మరిస్తే కాంగ్రెస్ సర్కారుకు పుట్టగతులు ఉండవని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. జహీరాబాద్ బస్టాండ్ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మ దహనానికి బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తలు దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆందోళనలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, రవీందర్, నర్సింహులు, వెంకటేశం, నారాయణ, నాయకులు గుండప్ప, యాకూబ్, ప్రవంతిరెడ్డి, మచ్చేంధర్, సంజీవ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, బండిమోహన్, ఎం ఆర్ ప్రవీణ్‌కుమార్, అమీర్, చంద్రశేఖర్‌రెడ్డి, కార్యర్తలు, రైతులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్న మాజీఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు

రైతులతో చెలగాటం ఆడుతున్న కాంగ్రెస్

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు తిలోదకాలు
- సీఎం రేవంత్ వెంటనే గద్దె దిగాలి
- హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ ధర్నాలో మాజీఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

హుస్నాబాద్, అక్టోబర్ 20: ఎన్నికలకు ముందు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, రూ.15వేల రైతు భరోసా ఇస్తామని, కౌలు రైతులకూ భరోసా కల్పిస్తామనే హామీలు ఇచ్చి తీరా గెలిచిన అనంతరం ఇచ్చిన హామీలను విస్మరిస్తూ రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కారు చెలగాటం ఆడుతున్నదని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. వానకాలానికి సంబంధించిన రైతు భరోసా ఇక రాదని స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించడం రైతులను ఘోరంగా మోసం చేయడమేనని అన్నారు. రుణమాఫీ చేయకుండా, రైతు భరోసా ఇవ్వకుండా మాటలతో పబ్బం గడుపుతున్న రేవంత్ రెడ్డి సీఎం పదవి నుంచి గద్దె దిగాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితా రెడ్డి, మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ ఎంపీపీ లకావత్ మానస, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, నాయకులు ఎడబోయిన రజనీతిరుపతిరెడ్డి, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, బండి పుష్ప, వాల నవీన్‌రావు, బొజ్జ హరీశ్, వంగ వెంకట్రాంరెడ్డి, యాటకార్ల స్వరూప, విజయభాస్కర్, బాషవేని రాజయ్య, అయూబ్, రవీందర్‌గౌడ్, మాధవరెడ్డి, వెంకటేశ్, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

తూప్రాన్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎఫ్‌డీసీ మాజీచైర్మెన్ ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

రైతుభరోసా ఇచ్చే వరకు పోరాడుతాం

బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్, అక్టోబర్ 20: రైతు భరోసా ఎగ్గొడితే సహించమని, రైతుభరోసా ఇచ్చే వరకు ప్రభుత్వంపై పోరాడుతామని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతు భరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆదివారం తూప్రాన్‌లో బీఆర్ఎస్ శ్రేణులతో కలసి తహసీల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ తీశారు. బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో ఉండే 67 లక్షల మంది రైతులకు, కోటి యాభై లక్షల ఎకరాలకు ప్రతి పంటకూ నాట్లకంటే ముందే రెండు పంటలకు రూ.7600 కోట్ల చొప్పున రూ.15 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమచేశారన్నారు. అనేక పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు కేసీఆర్ అమలు చేశారన్నారు. రైతులకు చేయూతనిచ్చినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నదని, హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నదని వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. ఆందోళనలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు సతీశ్‌చారి, మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు గౌడ్, మాజీ ఎంపీటీసీ సంతోష్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ గౌడ్, మాచిరెడ్డి కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, మన్నె శ్రీనివాస్, షేక్ బురాన్, జిన్న రాజు, యాసిన్, చింతల దశరథ, రమేశ్, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మోసం చేసిన కాంగ్రెస్‌ను పాతరేయాలి

- రైతుబంధు ఎత్తేసేందుకు ప్రభుత్వం కుట్ర
- బీఆర్ఎస్ ధర్నాలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, అక్టోబర్ 20: ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలిచ్చి అధికారం చేపట్టిన తర్వాత మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని పాతాళంలోకి పాతరేయాలని నారాయణఖేడ్ మాజీఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. రైతుబంధు ఇవ్వలేమని ప్రకటించిన ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆదివారం నారాయణఖేడ్‌లోని రాజీవ్‌చౌక్ వద్ద మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో రైతుబంధును రైతు భరో సాగా మార్చి ఎకరానికి రూ.7,500 ఇస్తామని ప్రకటించడంతోపాటు వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్, కౌలు రైతులకు రైతు భరోసా, రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇసామని ప్రకటించి ఇవ్వకుండా ఇప్పుడు మోసం చేస్తున్నదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధు సైతం సక్రమంగా ఇవ్వకుండా ఇప్పటికే రెండు దఫాలుగా ఎగబెట్టిందన్నారు. రైతుబంధు పథకాన్ని శాశ్వతంగా ఎత్తివేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నదన్నారు. రుణమాఫీ విషయంలోనూ రేవంత్ ప్రభుత్వం రైతులతో చెలగాటం ఆడుతోందని, ఇప్పటి వరకు వందశాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని 1.31 లక్షల ఎకరాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి ఇక్కడి రైతులకు అన్యాయం చేస్తున్నదన్నారు. నాగల్‌గిద్ద, నారాయణఖేడ్, కంగ్టి మండలాల్లో గతంలోని తమ ప్రభుత్వం ఎనిమిది కొత్త చెరువులను మంజూరు చేసి భూసేకరణ సైతం పూర్తి చేయగా, ఆ పనులు సైతం కొనసాగడం లేదన్నారు. హైదరాబాద్‌లో ప్రశాంతంగా నివసిస్తున్న ప్రజలను హైడ్రా పేరిట భయభ్రాంతులకు గురి చేస్తూ, గ్రామాల్లో రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ఏ ఒక్క వర్గానికి సంతృప్తి పర్చలేని దౌర్భాగ్య స్థితిలో రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. అంతకుముందు భూపాల్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి స్థానిక బీఆర్ఎస్ కార్యాలయం నుంచి రాజీవ్‌చౌక్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు.

నారాయణఖేడ్‌లోని రాజీవ్‌చౌక్ వద్ద బైఠాయించి రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు


దౌల్తాబాద్‌లో చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కాంగ్రెస్ సర్కారుకు పుట్టగతులు ఉండవు

దౌల్తాబాద్ ధర్నాలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, అక్టోబర్ 20: రైతులను నమ్మించి మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని, ఆ పార్టీకి పుట్టగతులు ఉండవని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి విమర్శించారు. ఆదివారం హత్నూర మండలం దౌల్తాబాద్ తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆరుగ్యారెంటీల పేరుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రజలను నట్టేట ముంచుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సగంమంది రైతులకే పంట రుణమాఫీ చేసి మోసం చేసిన కాంగ్రెస్ సర్కారు, ఇప్పుడు వానకాలం రైతుభరోసా ఎగ్గొట్టి మరోసారి మోసం చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు చేయూతనిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటున్నట్లు తెలిపారు. ఆందోళన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేసే కార్యక్రమాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

మెదక్ రాందాస్ చౌరస్తాలో చేపట్టిన ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

దౌల్తాబాద్‌లో సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


జిన్నారం అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన నిరసన దీక్షలో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

'మహా' చెత్త ముప్పు..!

- లక్డారంలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు వంద ఎకరాలు కోరిన జీహెచ్ఎంసీ
- హెచ్ఎండీఏ ఆధీనంలో 220 ఎకరాలు
- లక్డారంలో ప్రారంభమైన నిరసనలు
- డంప్‌యార్డుతో రోగాలు వస్తాయని గ్రామస్తుల ఆగ్రహం

పటాన్‌చెరు, అక్టోబర్ 20: లక్డారం గ్రామంలో హైదరాబాద్ మహానగర చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు స్థలం ఇచ్చే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. లక్డారంలోని సర్వే నెంబర్ 738లోని ప్రభుత్వ, అసైన్ భూములు దాదాపు 220 ఎకరాలను హెచ్ఎండీఏకు స్వాధీనం చేశారు. దానిలోంచి వంద ఎకరాలను జీహెచ్ఎంసీ మహానగర చెత్తను డంప్ చేసేందుకు కావాలని కోరుతున్నది. లేదంటే సర్వే నెంబర్ 747 లోని వంద ఎకరాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను జీహెచ్ఎంసీ కోరుతున్నది. ఈ మేరకు హెచ్ఎండీఏ అధికారులు భూముల హద్దులు, భూముల పరిస్థితి ఇతర విషయాలను పటాన్‌చెరు తహసీల్ కార్యాలయంలో కూపీ లాగుతున్నారు. హెచ్ఎండీఏ అధికారుల లెటర్ ఎల్ఆర్. నెంబర్. ఎస్‌డబ్ల్యుఎం/0002/2022/ ఏఈ-1. (ఎస్‌డబ్ల్యుఎం) తేది సెప్టెంబర్ 30,2024 ప్రతిని తహసీల్దార్‌కు అందజేశారు. సర్వే నెంబర్ 747లో క్రషర్లు, రైతులకు అసైన్ చేసిన భూములు ఉన్నాయి. హైదరాబాద్ మహానగరంలో రోజువారీగా పోగవుతున్న చెత్తను పారవేయడం పెద్ద సమస్యగా మారింది. నగరం నలుమూలల చెత్తను వేసి రీసైక్లింగ్ చేయడం, దానిని ఎరువుగా మార్చడం చేయాలనే ఆలోచనతో గ్రేటర్ మున్సిపాలిటీ ఉంది. ఈ మేరకు నగర శివారులోని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం లక్డారం, గుమ్మడిదల మండలం ప్యారానగర్ గ్రామంలో ప్రభుత్వ భూములను ఎంపిక చేసుకున్నారు. గుమ్మడిదల మండలం నల్లవల్లి పంచాయతీ ప్యారానగర్‌లో 152 ఎకరాలను జీహెచ్ఎంసీ డంప్ యార్డు కోసం కోరింది. దీనిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. లక్డారంలో భూములు ఖాళీగా ఉన్నవి చూసి ఇక్కడైనా డంపింగ్ యార్డు పెట్టాలని జీహెచ్ఎంసీ ప్రయత్నిస్తున్నది. గతంలోనూ ఉమ్మడి రాష్ట్రంలో ఈ భూముల్లో చెత్త డంపింగ్‌యార్డును ఏర్పాటు చేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు ప్రయత్నించారు. స్థానికులు, నాయకులు వ్యతిరేకించడంతో ఆ ప్రతిపాదన విరమించారు.

లక్డారంలోని చెత్త డంపింగ్ యార్డు ప్రతిపాదిత భూములు

హెచ్ఎండీఏకు 220 ఎకరాల అందజేత...

లక్డారం గ్రామం సర్వే నెంబర్ 747లోని వందల ఎకరాలు ఇవ్వలేని పక్షంలో, సర్వేనెంబర్ 738లోని వంద ఎకరాలైన కేటాయించాలని జీహెచ్ఎంసీ కోరుతున్నది. సర్వే నెంబర్ 738లో నాటి ప్రభుత్వం హౌసింగ్ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు ఆలోచించి ఆ భూమిని హెచ్ఎండీఏకు అందజేసింది.హెచ్ఎండీఏ ఆధీనంలోని భూముల్లోంచి వంద ఎకరాలు ఇస్తే దానిని స్వాధీనం చేసుకుని మహానగర చెత్తను డంపింగ్ చేసే యోచనలో జీహెచ్ఎంసీ ప్రణాళికా రచిస్తున్నది. వచ్చిన చెత్తను ఆధునిక పద్ధతుల్లో శుద్ధిచేసి రీసైక్లింగ్ అయ్యేలా చూస్తామంటున్నది. లక్డారం గ్రామస్తులు మాత్రం ముక్తకంఠంతో డంపింగ్ యార్డు వద్దని కోరుతున్నారు. ఇప్పటికే పరిశ్రమల కాలుష్యంతో, నక్కవాగు కాలుష్యంతో తమ ప్రాంతం ఎంతో నష్టపోయిందని, మరోపక్క క్రషర్ల దుమ్ముధూళితో, గుట్టల్లో బ్లాస్టింలతో గ్రామం భయానకంగా మారిందంటున్నారు. డంపింగ్ యార్డుతో ఈ ప్రాంతం మురికి కూపంగా మారుతుందని, రోగాలు వస్తాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం లక్డారంలో డంప్‌యార్డు ప్రతిపాదనను రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరిస్తున్నారు.


నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

కాంగ్రెస్ సర్కారు పతనం ప్రారంభం

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్,అక్టోబర్ 20: అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, గద్దెనెక్కిన తర్వాత అన్నివర్గాలను మోసం చేసిందని, కాంగ్రెస్ పతనం ప్రారంభమైందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం నర్సాపూర్‌లో కాంగ్రెస్‌కు చెందిన పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. హత్నూర మండలం కోనంపేటకు చెందిన గిరియాదవ్, నరహరి యాదవ్, సురేశ్, బాలరాజు, మల్లేశ్, భిక్షపతి, అశోక్, పర్వతాలు, లక్ష్మణ్‌తోపాటు సుమారు 43 మంది కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏ ఒక్క హామీ సరిగ్గా అమలు కాకపోవడంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఆవేదనతో ఉన్నారని, ప్రజలకు సమాధానం చెప్పలేక విరక్తి చెందుతున్నారని వెల్లడించారు. ముమ్ముందు బీఆర్ఎస్‌లోకి భారీగా వలసలు జరుగుతాయని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, కోనంపేట బీఆర్ఎస్ అధ్యక్షుడు దాసరి బాలేశ్ యాదవ్, అంబటి అర్జున్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్యంగౌడ్, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.